ప్రజాశక్తి

గురువారం 25 డిసెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మిర్చి యార్డుకు కొత్త సరుకు

స్వల్పంగా పెరిగిన ధరలు - ఆరు నెలల నిల్వ తరువాత క్వింటాళ్‌కు రూ.3 వేలు పెరుగుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డుకు గత వారం రోజులుగా కొత్త సరుకు రావడం ప్రారంభమైంది. రాయలసీమ నుంచి మిర్చి నిత్యం 10 వేల టిక్కీలు వరకు వస్తుంది. దీంతో యార్డుకు వచ్చే సరుకు క్రమంగా పెరుగుతోంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈఏడాది మిర్చి సాగు చాలా తక్కువగా, ఆలస్యంగాను సాగు చేశారు. దీంతో ఫిబ్రవరి నుంచి స్థానిక ప్రాంతాల నుంచి సరుకు రావడం ప్రారంభం కానుంది. ప్రస్తుతం కొత్త సీజన్ ప్రారంభం కావడంతో ఈఏడాది ధరలు స్వల్పంగా పెరిగాయి. గత రెండు నెలల క్రితం

ఉన్న ధరల కన్నా కనీసం క్వింటాళ్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు కొత్త సరుకు ధరలు లభిస్తున్నాయి. బుధవారం యార్డుకు 53,531 బస్తాలు సరుకు రాగా పాత నిల్వలతో కలిపి 51,884 బస్తాలు అమ్ముడుపోయాయి. ఇంకా 14,278 బస్తాలు నిల్వ ఉన్నాయి.

నాన్ ఎసి కామన్ వెరయిటీల్లో గరిష్ట ధర రూ.17 వేలు, కనిష్ట ధర రూ.10 వేలుగా ఉంది. తేజ, బాడిగ వెరయిటీ కూడా ఇదే ధరలు వస్తున్నాయి. ఆర్మూర్ రకం కనిష్టం రూ.10 వేలు, గరిష్టం రూ.12,700 ధర వచ్చింది. కోల్డ్ స్టోరేజీల నుంచి వచ్చిన సరుకుకూడా ప్రస్తుతం ఆశాజనకమైన ధరలు వస్తున్నాయి. ఎసి వెరయిటీల్లో 334 రకం కనిష్ట ధర రూ.10,500, గరిష్ట ధర రూ.16,700, నెంబరు 5 రకం రూ.11 వేలు-15వేలు, 341రకం రూ.11 వేలు-16,500, 4884 రకం

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

వక్ఫ్ భూములను పేద ముస్లిములకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలి

పారిశ్రామిక అవసరాల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

చినకాకాని సమీపంలో ఉన్న 71.57 ఎకరాల వక్ఫ్‌భూమిని పారిశ్రామిక అవసరాల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టకుండా పేద ముస్లిములకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. బుధవారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. నేతాజీ మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో 20 వేల మంది ఇళ్లు లేని పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, వీరిలో దాదాపు 5 వేల కుటుంబాలు ముస్లిములని చెప్పారు. 40 ఏళ్లుగా ఏ ప్రభుత్వమూ ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎమ్‌టిఎంసి పరిధిలోని పేదలకు రాజధాని ప్రాంతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు కోర్టు ఉత్తర్వులతో రద్దయ్యాయన్నారు. గత ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంత పేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలమిచ్చి ఇళ్లు నిర్మిస్తామని కూటమి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత నెలలో పేదలు వేలాది మంది ఆందోళన చేసి, దరఖాస్తులు ఇచ్చారని, ఆ సందర్భంగా స్థలాలు లేవని అధికారులు మభ్యపెట్టే ప్రయత్నం చేశారని, మరోవైపు మంగళగిరికి అతి సమీపంలో ఉన్న 71.57 ఎకరాల వక్ఫ్‌భూమిని పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శించారు. ముస్లిమలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమం అభివృద్ధికి వినియోగించాల్సిన భూములను కార్పొరేట్లు, ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని చూడటం సరికాదని అన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, నాయకులు వి.జవహర్‌లాల్, కె.అజయ్ కుమార్, ఎస్.ఎస్.చెంగయ్య, పి.కృష్ణ, బి.ముత్యాలరావు, ఎం.శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

గురువారం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా చిన్న చర్చిల నుండి పెద్ద చర్చిల వరకూ ప్రత్యేకంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనల కోసం కుర్చీలు, షామియానాలతో ఏర్పాటు చేశారు.

27న చలో రాజభవన్‌కు తరలిరండి

ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరించాలని, పనిహక్కును కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విబి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం జరిగే చలో రాజభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు కోరారు. ఈ మేరకు స్థానిక పుతుంబాక భవన్‌లో ఆయన కౌలురైతు సంఘం నాయకులు పి.మహేష్, కెవిపిఎస్ నాయకులు జె.భగత్‌తో కలిసి బుధవారం విలేకర్లతో మాట్లాడారు. 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, కౌలురైతులు, పేదలకు అండగా నిలిచిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పనులను ఏడాదిలో 200 రోజులు, రోజువారీ కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేస్తుండగా కేంద్రం మాత్రం అసలు పని హక్కునే తొలగించబూనుకుందని విమర్శించారు. పైగా కేంద్రం భరించాల్సిన 90 శాతం నిధుల వాటాను 60 శాతానికి తగ్గించుకుని రాష్ట్రాలపై 40 శాతం వాటా పెంచుతూ రాష్ట్రాలపై భారాలు వేస్తోందని అన్నారు. ఇప్పటికే వేతనాల చెల్లింపు ఆలస్యమవుతోందని, కొత్త పథకం అమలైతే పనులు దొరక్కపోవడంతోపాటు వేతనాలు ఎప్పుడు అందుతాయో చెప్పలేమని అన్నారు. ప్రమాద పరిహారాల చెల్లింపు బాధ్యత నుండీ కేంద్రం వైదొలిగిందని, మొత్తంగా పేదల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి చేపట్టే ఆందోళనకు కూలీలంతా తరలిరావాలని కోరారు.

కరాటే క్రీడాకారిణికి ఎంపీ, ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - రెంటచింతల : పల్నాటి రైతు బిడ్డ గొంటు రోహితారెడ్డి జాతీయ స్థాయి కరాటే బంగారు పతకం సాధించడం ద్వారా పల్నాడు కీర్తిని చాటారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభినందించారు. మిట్టగుడిపాడులో రోహితారెడ్డిని వారు బుధవారం కలిసి అభినందించారు. కోచ్ నవీన్ కుమార్ గౌడ్‌ను, తండ్రి రవికిరణ్‌రెడ్డి, సుమంత్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో దుబాయ్‌లో జరిగే పోటీల్లోనూ

రోహితారెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మొక్కజొన్నలో కలుపు యాజమాన్యం చేపట్టాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని ముస్సాపురం, పొడపాడు, గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, మినుము పొలాలను మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య పరిశీలించారు. మొక్కజొన్నలో కలుపు యాజమాన్యం చేపట్టాలన్నారు. మొవ్వ పురుగు నివారణకు క్యాబోఫురాన్ 3జి గుళికలు ఎకరాకు 4 కేజీలు వరకు మొవ్వలో వేయాలని, కత్తెర పురుగు నివారణకు ఎకరాకు ఇమామేక్టిన్ బెంజోఎట్ 100 గ్రాములు లేదా కోరాజన్ 60 మిల్లీలీటర్ల చొప్పున పైపాటుగా పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.వెంకటేష్, రైతులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం

ప్రజాశక్తి- పెదకూరపాడు

ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పనులపై జిల్లా పీడీ సిద్ధలింగయ్య సమీక్షించారు.ఒక్కొక్క గ్రామానికి రూ.1000 నుంచి 5000 పెనాల్టీ విధించారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు బుధవారం నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేకు కోసి, కొవొత్తులు వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జిల్లా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ మాట్లాడారు. ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు ప్రకాష్, ఫాస్టర్లు నిర్మలరావు, ట్రెజరర్ క్రీస్తుదాసు, బాబురావు, ఎలీషా, తిమోతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వరరావును మాచర్ల తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ షేక్ ఖాసిం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ ఖాశిలం మాట్లాడుతూ ఎపిఎన్‌జిఓస్ పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా, ఖమ్మంపాడు పీహెచ్సీ హెల్త్ సూపర్వైజర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం వెంకటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో మాచర్ల సెక్రటరీ నాగేశ్వరరావు తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కొత్త పథకం ప్రతులు దహనం

ప్రజాశక్తి - దుగ్గిరాల

పని హక్కును కాలరాశి గాంధీ పేరును తొలగించి జిరామ్‌జి పేరుతో తెచ్చిన పథకాన్ని రద్దు చేయాలని, 2005చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 27న చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చిలువూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కొత్త చట్టం జీవోని ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కార్మికులకే కాకుండా చిన్న సన్నకారు రైతులకు అన్నం పెట్టిన మరియు లక్షలాది ఎకరాల పేదల భూమిని అభివ ద్ధి చేసి వేలాదిమంది యువకులకు ఉద్యోగాలు కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చటం దుర్మార్గం అన్నారు. పేదలకు ఆత్మస్థైర్యాన్ని ఆర్థిక స్వాలంబనను భూస్వామ్య దౌర్జన్యాలను ఎదుర్కొనే శక్తినిచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గుండెకాయ లాంటి హక్కును కాలరాశి మొండెం లేని తలకాయ లాగా జి.రాంజీ పేరుతో కొత్త చట్టాన్ని తెచ్చి కోట్లాదిమంది పేదలకు అన్యాయం చేసిందన్నారు. బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం మరియు వైసీపీ ఎంపీలందరూ ఒక్కటై కోట్లాదిమందికి

వెన్నుపోటు పొడిచిన, బిజెపి తెచ్చిన కొత్త చట్టానికి ఓట్లు వేసి మన రాష్ట్రానికి, ద్రోహం చేశారన్నారు. అంతే కాకుండా మన జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీని చంపిన గాడ్సే పేరు వచ్చేలా, జి. రామ్, జి.అనే పేరు మార్చారన్నారు కాబట్టి 2005 చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని కోట్లాదిమందికి గ్యారెంటీ హక్కును రద్దు చేస్తున్న 2025 చట్టాన్ని రద్దు చేయాలని డిసెంబర్ 27వ తేదీ" చలో" రాజ్ భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, కోరుతూ ఈ కార్యక్రమానికి,రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు రైతాంగము కౌలు రైతులు,ఉపాధి సిబ్బంది ప్రజలు ప్రజాస్వామిక,వాదులు పెద్ద ఎత్తున పాల్గొని, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని, విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు ఎం.కోటేశ్వరావు, కె.ధర్మయ్య, కె.కోటేశ్వరరావు, ఆర్.పాప ఎం.శశి, వి.శ్రీనివాసరావు, ఎం.నరేంద్ర, జి.శ్రీనివాసరావు కె.శ్రీనివాసరావు డి.నాగేశ్వరావు ఎస్.నాగేంద్ర ఆర్.భూషణం పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయ ఎగుమతులు, ఎగుమతి అవకాశాలపై రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం అవగాహన" కార్యక్రమం జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపిఇడిఎ సంస్థ ప్రతినిధి డి.పెద్దస్వామి హాజరై పలు అంశాలను వివరించారు. నాబార్డు డిడిఎం జి.శరత్ బాబు మాట్లాడుతూ రైతులకు నాబార్డ్ ద్వారా అందించే వివిధ పథకాలు, రాయితీ వివరాలు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించి తద్వార అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. అన్ని రకాల పండ్ల, కూరగాయల తోటలలో అనుసరించాల్సిన ప్రకృతి సేద్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సూక్ష్మ నీటి సేద్యం ప్రాజెక్టు డైరెక్టర్ సి.హెచ్ ఆంజనేయులు మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 50 శాతం రాయితీపై స్ప్రింక్లర్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్, ఉద్యాన అధికారులు షేక్.నబిరసూల్, వై.మోహన్, ఆర్.శ్రీలక్ష్మీ, అంజలిభాయి పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు కొత్త సరుకు

(మొదటి పేజీ తరువాయి)

రూ.12 వేలు-రూ.14000 ధర వచ్చాయి. ఎసి స్పెషల్ వెరయిటీల్లో తేజ రూ.10 వేలు కనిష్ట ధర కాగా గరిష్ట ధర రూ.15 వేలు బాడిగ రూ.10 వేలు-16,500, దేవనారు డీలక్స్ వెరయిటీ రూ.10,500-16,200 ధర పలికింది. మొత్తంగా అన్ని రకాలకు ధరలు పెరిగాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు మిర్చి ధరలు ఏమాత్రం ఆశాజనకంగా లేక రైతులు నష్టపోయారు.

ఈ ఏడాది మిర్చి సాగు కూడా గణనీయొంగా తగ్గింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా 1.65 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది పల్నాడు .జిల్లాలో 1.10 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది. అంతేగాకుండా ఈ ఏడాది ఆదిలోనే మిర్చికి నల్లతామర, జెమినీ వైరస్ తెగుళ్లసోకడం వల్ల పంట దిగుబడి ఏమేరకు చేతికి వస్తాయన్న అంశంపై రైతులు ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాఏటా 6 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు అయ్యేది. ఈ ఏడాది 4.10 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గడం, మరోవైపు తెగుళ్ల ప్రభావం అధికంగా ఉండటం వల్ల దిగుబడిపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సరుకుతోపాటు కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న మిర్చికి కూడా డిమాండ్ పెరిగింది. దీంతో స్వల్పంగా ధరలు పెంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు క్వింటాళ్‌కు గరిష్ఠంగా రూ. 27 వేలు వరకు ధర లభించింది. ఈ ఏడాది జనవరి నుంచి మే నెలకు గరిష్ట ధర రూ.13 వేలు కూడా దాటలేదు. దీంతో ధరలు తగ్గి ఎక్కువ మంది రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. దాదాపు ఆరేడు నెలల తరువాత ధరలు స్వల్పంగా పెరగడంపై రైతులు నిట్టూరుస్తున్నారు.

కూటమి పాలనలో కుంభకోణాల పేటగా మారింది

- పనులు చేయకుండానే బిల్లులు డ్రా
- రూ.డబ్బులు తీసుకుని పూజారి ఉద్యోగాలు : వైసిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి పాలనలో నరసరావుపేట కుంభకోణాల పేటగా మారిందని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నరసరావుపేటలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణి సాగరమ్మ మృతి, మెప్మాలో నకిలీ గ్రూపులు సృష్టించి అవినీతి, పోలీసు ఎఎస్ఐ కుమారుడు కార్ల చోరీలు, అధికారుల వేధింపులతో కోటప్పకొండలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నాసరయ్య గుండెపోటుతో మృతి వంటివాటిని ప్రస్తావించారు. కోటప్పకొండ ఆలయ ఇఓ, సూపరింటెండెంట్ కుమ్మక్కై, కాపు సామాజిక తరగతికి చెందిన ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఆలయ అధికారుల వేధింపులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. కొండపై పారిశుధ్య కార్మికులను తొలగించి నరసరావుపేటలో సులభ్ కాంప్లెక్స్ పనిచేసే వారిని నియమించారన్నారు. అభివృద్ధి పనులు చేయకుండానే రూ.లక్షలు బిల్లులు ప్రతినెలా డ్రా చేస్తున్నారని, గతంలో ఉన్న రూ.2 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఉద్యోగులకు ఉపయోగిస్తున్నారని, మరి రోజువారీ ఆదాయం ఏమవుతోందని ప్రశ్నించారు. ఆలయ ఇఓ కొత్తగా ముగ్గురు పూజారులను నియమిస్తే వద్దని ఆ కుటుంబం నుండి 10 మంది దేవస్థానంలో పనిచేస్తున్నారంటూ ఎండోమెంట్ కమిషనర్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లేఖ రాశారని, ఆ తర్వాత తిరిగి ఒక్కొక్కరి వద్ద రూ.15-20 లక్షలు తీసుకొని వారికే మళ్లీ ఉద్యోగాలు ఇచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారని అన్నారు. రానున్న మహాశివరాత్రి ఏర్పాట్లపై ఇప్పటికీ సమీక్షించలేదని, అవిశాయపాలెం-కోటప్పకొండ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదైనా పూర్తి కాలేదని విమర్శించారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 18వ తేదీ తాడేపల్లి పట్టణంలోని అంజిరెడ్డి కాలనీలో జరిగిన హత్య కేసులో ఇరువురు ముద్దాయిలను బుధవారం మీడియా ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా మీడియాతో మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ హత్య కేసుకు సంబంధించిన వివరాలును వెల్లడించారు. అంజిరెడ్డి కాలనీ సమీపంలో మళ్లీనేని సాయి భవాని, వేమూరి మహేష్ బాబు అతని స్నేహితులతో కలిపి అరటి తోట సమీపంలో రోడ్డుపై పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నారు. హత్యకు గురైన ఇళ్ల చెరువు వెంకటరావు (32) అంజిరెడ్డి కాలనీ వైపు వెళ్తూ ఆటోను పుట్టినరోజు జరుపుకుంటున్న యువకుల వైపు పోనిచ్చి క్రాస్‌గా ఆటోను కట్ చేశాడు. దీంతో అక్కడున్న యువకులకు మృతుడు వెంకట్రావుకు ఘర్షణ జరిగింది. అనంతరం అంజిరెడ్డి కాలనీకి వెళ్లిన వెంకటరావు మరలా అదే మార్గంలో వస్తూ ఆటోను యధావిధిగా యువకులవైపు పోనిచ్చి కట్ చేశాడు. అప్పటికే ఫుల్లుగా మద్యం సేవించి ఉన్న యువకులు కోపంతో పల్సర్ బైక్ పై ఆటోను వెంబడించి నిలుపుదల చేశారు. మా మీదకి ఆటో రానిస్తావా అంటూ గొడవకు దిగి మళ్ళీ ఘర్షణ పడ్డారు. దీంతో యువకులు అరటి తోటలో పారిపోతున్న వెంకట రావును వెంటబడి సాయి భవాని, మరియు మహేష్ బాబు వెంటపడి రాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసు మిస్టరీని ఛేదించడంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, మంగళగిరి డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ పర్యవేక్షణలో, తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు నేతృత్వంలో తాడేపల్లి ఎస్సై ఎస్ కే ఖాజావలి, ప్రదీప్, కానిస్టేబుల్స్ వి ప్రసాదరావు, జోసెఫ్, బి రవికుమార్ బృందంగా ఏర్పడి నేరస్తులను బుధవారం బ్రహ్మానందపురంలోని ఎయిమ్స్ హాస్పిటల్‌కి వెళ్ళే రోడ్లో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు అందజేశారు.

గంజాయి అమ్మిన.. కొనుగోలు చేసిన కఠిన చర్యలు

ఈ సందర్భంగా డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాను గంజాయి రహితంగా మార్చటమే ఉద్దేశంగా జిల్లా ఎస్పీ రకుల్ జిందాల్ పనిచేస్తున్నారని, తామంతా కూడా ఆయన ఆదేశాల మేరకు గంజాయి లేని జిల్లాగా మార్చటానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. అ మేరకు మంగళగిరి నియోజకవర్గంలో విస్తృతంగా మైక్ ద్వారా, కాలేజీలు, పాఠశాలల్లో సమావేశాలు, పబ్లిక్ మీటింగులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా సరఫరా చేస్తున్నట్లు సమాచారం వస్తే1972 ఈగల్ టీం ఫోన్ చేయటం ద్వారా నియంత్రించవచ్చునని సూచించారు.

చిన్నారులతో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ

స్వధార్ పిల్లలకు ఆధార్ అవకాశం కల్పిస్తాం

ప్రజాశక్తి - తెనాలి

జెయంజె నిర్వహణలోని స్వధార్ హోమ్ లో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, కుటుంబ పరిస్థితులు సరిలేని మహిళలు స్వధార్ హోమ్ లో ఆశ్ర పొందుతుంటారు. మహిళలు చేతివృత్తులు నేర్చుకుని వాటిపై జీవనాన్ని సాగించే విధంగా ఇక్కడ శిక్షణ ఉంటుంది. వారితో సరదాగా కొంతసేపు గడిపేందుకు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ వెళ్లారు. అదే సమయంలో అక్కడ తలదాచుకుంటున్న తల్లిదండ్రులు లేని, కనీసం గార్డియన్ కూడా లేని చిన్నారులు ఆధార్ కార్డు కావాలని తహశీల్దార్‌ను కోరారు. అయితే తహసిల్దార్ గార్డియన్ గా వారికి ఆధార్ తీసుకునే అవకాశం ఉందని వివరించి, కచ్చితంగా ఆధార్ అవకాశం కల్పిస్తామని భరోసానిచ్చినట్లు ఆయన వెల్లడించారు. గతంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో స్వధార్ లో ఆశ్రయం పొందిన మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకునే విధంగా ఆర్టిసి బస్ స్టాండ్ లో షాపు కేటాయింప చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో పండుగ వాతావరణంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి వారితో సరదాగా గడిపారు. కార్యక్రమంలో స్వధార్ హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీనియర్ల సహకారంతోనే పనిచేస్తా

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు షేక్ జాన్ సైదా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులను కలుపుకొని వెళ్తానని టిడిపి నూతన జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా తెలిపారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో తాను గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నాని తెలిపారు. అమరావతి మండలంలో అత్యంత చురుగ్గా పనిచేయడం వల్ల తనపై గత ప్రభుత్వం 28 అక్రమ కేసులు బనాయించిందన్నారు. తనపై గత ప్రభుత్వం రౌడీసీట్ కూడా తెరిచిందని తెలిపారు. తాను పార్టీ కోసం అప్పటి ప్రభుత్వంపై పోరాటం చేయడం వల్లే తనకు గుర్తింపుగా తనకు పార్టీ అధిష్టానంజిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టిందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పనిచేశానని చెప్పారు. పార్టీలో దిగువ స్థాయి నుంచి వచ్చినందున కార్యకర్తల కష్టాలు తనకు తెలుసునని ప్రతి కార్యకర్తను గౌరవిస్తానని తెలిపారు. కార్యకర్తలకు గుర్తింపు కోసం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇచ్చేలా ప్రజా ప్రతినిధులతో చర్చిస్తానని తెలిపారు. నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, జిల్లాలోని ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తానని తెలిపారు. గత ఎన్నికల్లో టిడిపి కూటమి గాలి బాగా ఉన్నా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో టిడిపికి తక్కువ ఓట్లు వచ్చాయని ఈ కేంద్రాల పరిధిలో పార్టీ బలోపేతానికి స్థానిక నాయకలు,కార్యకర్తలతో చర్చించి రాబోయే ఎన్నికల్లో 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని తెలిపారు.

పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యం ఆసక్తికరం

వెయ్యికి పైగా గ్రీటింగ్ కార్డులు తయారు చేసిన వందమంది విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వెయ్యికి పైగా గ్రీటింగ్ కార్డులను తయారుచేశారు. పాఠశాల చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యం లో బుధవారం 100 మందికి పైగా చైల్డ్ ఆర్టిస్టులు పాల్గొని గ్రీటింగ్ కార్డులను రూపొందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరీముల్ల విద్యార్థులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు అందజేశారు. బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ బొమ్మలను అమితంగా ఇష్టపడే విద్యార్థులు ఆబొమ్మలకు స్వయంగా రంగులు అద్ది అందమైన గ్రీటింగ్ కార్డులను తయారుచేయడం అభినందనీయమన్నారు. బొమ్మలు, ప్రకృతి దృశ్యాలు, దేశ నాయకులు, స్వచ్ఛభారత్, దేవుళ్ళ బొమ్మలను పోస్ట్ కార్డులపై గీసి అందరి మనసులను ఆకట్టుకున్నారన్నారు. దాదాపు వెయ్యికి పైగా కార్డులు గీసి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను చాటిచెప్పారని తెలిపారు. ముఖ్యంగా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రాలను అందంగా గీసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పాలపర్తి శ్రీనివాసరావు, సోమశేఖర్, క ష?జ, శివకుమారి, స్వప్న, వెంకటేశ్వర్లు, రమేష్, హబీబ్ బాషా, సునీల్, శ్రావణి, బాలమ్మ, శివ పార్వతి, రజియా, కాత్యాయని విద్యార్థులను అభినందించారు.

లాడ్జీలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ ఆంజనేయ రెసిడెన్సీ పై పట్టణ సిఐ నాగమల్లేశ్వరావు సిబ్బంది తో దాడిచేశారు. ఐదు జంటలను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు యువతులు, ఇద్దరు మహిళలు, 5గురు విటులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ కు తరలించారు.లాడ్జి నిర్వాహకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - తాడికొండ

ఆటో ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లాం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన ఉప్పలపాటి సుదర్శనరావు (43) గుంటూరులోని ఓ ట్రావెల్ ఆఫీసులో పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. రోజులాగే గుంటూరు కార్యాలయంలో పని ముగించుకుని తాడికొండకు తన ద్విచక్రవహనాంపై వస్తుండగా లాం గ్రామంలోని ఆర్కా కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న ఆటో అతివేగంతో సుదర్శనరావు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా సుదర్శనరావు తీవ్రగాయాలతో రహదారిపై పడిపోయాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్ సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.S.NO.162 OF 2025

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager ...Plaintiff
And
Sri Rajeswar Rao Vemula, aged about 55 years, Occ: Sole Proprietor, Real Estate Business, R/o. D.No.32-8-3, Alapati Nagar, 6th Lane, Sultanbad, Tenali, Guntur, A.P - 522202 ...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.66,889.85Ps. (Rupees Sixty Six Thousand Eight Hundred Eighty Nine and Eighty Five Paise only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **22-01-2026** for your appearance in person or through duly appointed Advocate at **10-30**A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony,
Moosarambagh, Hyderabad-500 036

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐపి నెం. 22/ 2025

బిట్వీన్:
భూపతి రామాంజనేయులు ... పిటిషనర్
మరియు
తుమ్మ బాజీరెడ్డి అండ్ వగైరాలు ... రెస్పాండెంట్లు

To,
R1) తుమ్మ బాజీరెడ్డి S/o కొండారెడ్డి R/D No: 11/180, 6 వ నెంబర్ వీధి, మునుస్వామి నగర్, నగరాలు, అమరావతి రోడ్డు గుంటూరు.
R3) పసుమర్తి చైతన్య R/D.No: 1-280, నందిరాజు తోట, హెూలీ క్రాస్ స్కూల్ దగ్గర, బాపట్ల పట్టణం.
R4) యాదగిరి గోపి R/D.No: 2-5-1, 1 వ లైను హౌసింగ్ బోర్డ్, నీళ్ల ట్యాంక్ ఎదురు, అపోలో ఫార్మసీ దగ్గర, గుంటూరు.
R6) విప్పర్ల ఏడుకొండలు, S/o వెంకటేశ్వర్లు, R/D.No: 7-280, మున్సిపల్ ఆఫీస్ రోడ్, నీళ్ల ట్యాంక్ దగ్గర, చిలకలూరిపేట.

పై నెం. ఐపి దావాలో శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు ఐపీ నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పైకోర్టు వారి ఎదుట ది.29-12-2025 న ఉదయం 10:30 ని.లకు మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా ది.29-12-2025

ఇట్లు.
ఎం.పి.వెంకటేశ్వర రెడ్డి,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట

జనరల్ నోటీసు
మహారాజశ్రీ తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 1554/2025

బిట్వీన్:
తోకల మధుసూదన బాబు ఎలియాస్
ఏసు మధుసూదన బాబు .... పిటీషనర్
ఎదిరి
నిల్ .... రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్లో పిటీషనర్కు దుర్గమ్మ భార్య అయి వున్నది, వీరికి తోకల జాషువ గిడెన్ అను మైనర్ కుమారుడు కలడు. వీరి ఇరువురు శ్రీ కోర్టు వారి ద్వార విడాకులు పొంది యున్నారు. వీరి మైనర్ కుమారుడు పిటీషనర్ వద్దనే వుంటున్నాడు. పిటీషనర్ తల్లిగారైన తోకల కుమారి గారు మనవడిపై ఆపేక్షతో పిటీషన్ షెడ్యూలు దాఖల ఆస్థులను గిఫ్టు డీడ్ చేసి యున్నది. తోకల కుమారి గారు ది.04-11-2018న చనిపోయి నారు. పిటీషనర్ యొక్క మైనర్ కుమారుడు ఆరోగ్యము సరిగా లేనందున అతను ప్రి మెచ్యూరిటీ మైండ్ కలిగి యున్నందున, అతని ఆరోగ్యము నిమిత్తము, చదువు నిమిత్తం, అతని యొక్క మంచి చెడులు చూసు నిమిత్తం సదరు ఆస్థులను లోను కొరకు తనఖా పెట్టుటకును, అమ్ముటకును, పర్మిషన్ కొరకు సదరు కోర్టులో పిటీషన్ దాఖలు చేయగా ది.02-01-2026న తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం. 10-30నిఎలకు సదరు పిటీషన్పై ఎవ్వరికైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్ ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

వాయిదా తేది. 02-01-2026

కె. గీతా మాధవి,
పిటీషనర్ తరపు న్యాయవాది, తెనాలి,
సెల్ నెం. 9490343121

జనరల్ నోటీసు
మహారాజశ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
యస్.ఓ.పి.నెం.111/2025

1. షేక్ జాన్‌బి.
2. మహమ్మద్ అయతుల్లా భేగ్,
3. మహమ్మద్ అయమాన్ భేగ్. .... పిటిషనర్లు.

ఎదిరి
.. నిల్ .. .... రెస్పాండెంట్లు.

పై నంబరులోని పిటిషనర్లు పిటీషన్ షెడ్యూల్డ్ దాఖలా చరాస్థులకు సంబంధించి లేటు అస్గర్ ఆలీభేగ్ గారు జీవించియున్న కాలములో పిటీషన్ షెడ్యూల్డ్ దాఖలా కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ నెం.11192823, తేది:05-04-2024న పాలసీ తీసుకొని ది.16-11-2024న అనారోగ్య కారణంగా పొన్నూరులోని కీర్తి ఆసుపత్రి నందు చికిత్స పొందుచూ చనిపోయిన కారణంగా పిటిషనర్లు లేటు అస్గర్ ఆలీబేగ్ గారికి వారసులైనందున పై తెల్పిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ క్లైమును సదరు ఇన్సూరెన్స్ కంపెనీ నుండి తీసుకొనుటకు కంపెనీవారు కోరినందున పిటిషనర్లు పై పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. కావున సదరు విషయమై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు వున్నచో ది. 31-12-2025న ఉదయం గం॥ 10.30 ని॥లకు పైకోర్టువారి ఎదుట హాజరై అభ్యంతరములు, ఆక్షేపణలువున్న తెలుపుకొనవలెను. లేనిచో ఎలాంటి అభ్యంతరములు లేవని శ్రీకోర్టువారు భావించి కేసును పిటిషనర్లు తరపున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది: 31-12-2025.

ఇట్లు
బొనిగల అంకమ్మరావు,
పిటీషనర్ల తరపు న్యాయవాది,
పొన్నూరు - 522124,
సెల్ : 9866673301.

పొన్నూరు,
తేది:04-12-2025.

PUBLIC NOTICE
IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE :: GUNTUR
O.P. NO.918 /2023

Between:
Kamineni Gopi ....Petitioner
And
Manish Sah. J and others ....Respondents

To,
R-1: Manish Sah. J S/o Jithendra Prasad
East Rama Krishna Nagar ,
South Sangarmor, Jai grana store ,
Sampatchak , Patna , Bihar 800001
Driver of Lorry TN04 BA 6774.

You are the 1st respondent in the above mentioned O.P. The Honourable Court Order to issue notice through paper publication .So you are here by directed to appear before this Honourable Court on 30-12-2025 at 10:30 am. Personally or by an advocate to submit your objections, failing which the Honourable Court will be decided in your absence.

By order of the Court
G.KAMALAKAR RAO,
M.BALARAM,
Advocates for Petitioner, Guntur

క్రిస్మస్‌పై ప్రత్యేక చిత్రాలు

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)

నియోజకవర్గ కేంద్రమైన వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారులు బొడ్డుచర్ల ప్రసాద్‌రావు క్రిస్మస్ సందర్భంగా క్రీస్తు పుట్టుకను తెలిపే జంట చిత్రాలను వేశారు. ఈ చిత్రాలను పట్టణ ప్రముఖులు, తోటి కళాకారులు చూసి అభినందించారు.

సరిపడా యూరియా అందుబాటులో : ఏవో

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

యూరియాను ఎంఆర్‌పికి మించి అమ్మితే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. మండలంలో 250 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో జమ్మలమడక గ్రామ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు తనిఖీ చేసి, రైతులకు వారి విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ చేశారు. కంభంపాడు 1-2, గన్నవరం, జమ్మలమడక తాళ్లపల్లి, కొప్పునూరు రైతు భరోసా కేంద్రాల్లో 20 టన్నుల చెప్పిన యూరియా అందుబాటులోకి తెచ్చామని, మండలంలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఏవో చెప్పారు.

వచ్చేనెలాఖరుకు రాకపోలకు అవకావం

పాల్వాయిగేటు ఆర్వోబీపై రెండ్రోజుల్లో గడ్డర్లు

ప్రజాశక్తి - రెంటచింతల : 167 ఎడి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాలువాయి గేట్ గ్రామంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు సంబంధించి గడ్డర్లను బ్రిడ్జిపై రెండ్రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు బుధవారం రైల్వే ఇంజినీరింగ్, నేషల్ హైవే అధికారులు పాలువాయిగేట్ గ్రామాన్ని సందర్శించారు. శుక్రవారం ఉదయం పనులు మొదలుపెట్టి శనివారం సాయంత్రం కల్లా గడ్డర్లను అమర్చుతామని చెప్పారు. ఒక్కో గడ్డర్ 36 మీటర్ల పొడవుందన్నారు. రెండు మూడు రోజుల్లో సిమెంట్ కాంక్రీట్ వేస్తామని, జనవరి చివరి కల్లా వాహనాలు ఆర్వోబీ పై నుంచి వెళ్లే వీలుంటుందని ఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రకాశంలు చెప్పారు. అనుమతులు రావడంలో జాప్యం వల్ల పనులు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు.

28న యుటిఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : వినుకొండలో ఈనెల 28న జరిగే యుటిఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎలు, పిఆర్‌సిపై చర్చించి ఈ సమావేశంలో తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ సత్తెనపల్లి మండల అధ్యక్షులు పి.రమేష్‌బాబు, గౌరవాధ్యక్షులు టి.శేషగిరి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన వందరోజుల ప్రణాళిక పేరుతో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆప్షన్ హాలిడే సౌకర్యాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. ఆప్షనల్ హాలిడే వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి ప్రకటించే సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బివి.శేషిరెడ్డి, కె.అనురాధ, కె.నరసింహారావు, జి.జగదీష్ కుమార్, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.1.80 కోట్లతో ఎస్టీ బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - మాచర్ల, మాచర్ల రూరల్

నియోజకవర్గంలోని పలుచోట్ల బుధవారం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మాచర్ల పట్టణంలోని పిడబ్ల్యూడి కాలనీలో రూ.1.80 కోట్లతో గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. రూ.7.45 కోట్లతో పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకి పైలాన్‌ను ఆవిష్కరించారు. స్థానిక టిట్కో ఇళ్ల సముదాయం వద్ద రూ.2.80 కోట్లతో నిర్మిస్తున్న ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌కు భూమి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తపల్లి జంక్షన్ నందు రూ.5 కోట్లతో కొత్తపల్లి - విజయపురిసౌత్ ప్రధాన రహదారికి శంకుస్థాపన చేశారు.విజయపురిసౌత్‌లోని మత్యకారుల కాలనీలో రూ.5 కోట్లతో నిర్మించిన సీసీ-బీటీ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. 7 మైలు ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో రూ. 20 లక్షలతో నిర్మించే నూతన మరుగుదొడ్లకు శంకుస్థాపన చేశారు. రెంటచింతల మండలం మిట్టగుడిపాడు గ్రామంలో రూ.4 కోట్ల 10 లక్షలతో నిర్మిస్తున్న గిరిజన సంక్షేమ పాఠశాల భవనాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఆర్ఎస్ హైస్కూల్ చెందిన అన్‌ఎయిడెడ్ ఉపాధ్యాయుల తమ సమస్యలపై వినతులిచ్చారు. మిట్టగుడిపాడు కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీలగురవారెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు అబ్బిరెడ్డి, నాయకులు ధారునాయక్, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, డీటీడబ్ల్యువో గోవిందునాయక్, డీఈ రియాజుద్దీన్, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, విజయపురిసౌత్ కార్యక్రమంలో నాయకులు ఎన్.వీరాస్వామి యాదవ్, బి.వెంకటేశ్వర్లు చౌదరి, ఎం.అప్పలరాజు, ఆర్.సైదారావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణ గ్రహీతలకు సహకరించాలి

రుణ గ్రహీతలకు బ్యాంకర్లు సహకరించాలని ఎంపీ, ఎమ్మెల్యే కోరారు. మాచర్లలోని మానుకొండ కళ్యాణ మండపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రుణ వితరణకు వారు హాజరై లబ్ధిదారులకు మంజూరైన రూ. 101 కోట్ల చెక్కులను అందించారు.

హాస్పిటల్ అభివృద్ధికి సహకారం

మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించగా ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రిని 50 పడకల నుండి 100 పడకల పెంచుతామని, అభివృద్ధికి అవసరమైన ఇతర సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపుపై వైద్యులు, అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మాచర్ల, వినుకొండ

ఆసుపత్రిలకు నేషనల్ క్వాలిటీ సర్టిఫికెట్లు వచ్చినట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కెపి చారి మాట్లాడుతూ జిల్లాలో ఏడు సీహెచ్చీసీలు ఉండగా మాచర్ల వైద్యశాలకు క్వాలిటీ సర్టిఫికెట్ వచ్చిందని, దీనిద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు అందే అవకాశం ఉందని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ క ష? దేవ రాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ నందరెడ్డి లు చెప్పారు. దుర్గి మండలం అడిగొప్పుల గ్రామంలో ఈనెల 21 రాత్రి హత్యలకు గురైన అన్నదమ్ములైన కొత్త శ్రీరామూర్తి, హనుమంతు కుటుంబాలను ఎంపి, ఎమ్మెల్యే పరామర్శించారు. కొత్త శ్రీరాంమూర్తి, హనుమంత్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అండగా ఉంటాంమని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. పోలీసులు త్వరలోనే నిందుతులను పట్టుకుంటారని చెప్పారు. గ్రామంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్న దృష్ట్యా పికెట్ ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు కె.శివారెడ్డి, ఎల్.బ్రహ్మయ్య, డి.జానకి రామయ్య, డి.రాఘవలు, పి.బుజ్జి పాల్గొన్నారు.

తాగి బండి నడిపితే జరిమానా : డీఎస్పీ

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

ప్రజాశక్తి - బొల్లాపల్లి (ఈపూరు)

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని నరసరావుపేట ఇన్‌ఛార్జి డిఎస్పీ ఎం.హనుమంతరావు అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఈపూరులోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించిన ఆయన రికార్డుల పరిశీలన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. హెల్మెట్, సీట్ బెల్ట్ లేని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై జరిమానాలు వేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు ఉంటాయన్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి, చెన్నై-కలకత్తా జాతీయ రహదారి, మార్కాపురం-గుంటూరు రహదారుల్లో అత్యంత ప్రమాదకరమైన 33 ప్రాంతాలను గుర్తించి ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ, స్థానిక గ్రామస్తుల సహకారంతో హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు తెల్లవారుజామున ప్రయాణించే వాహనాల డ్రైవర్లకు ముఖం కడిగించి పంపిస్తున్నట్లు చెప్పారు. కాలేజీల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి మాదకద్రవ్యాల నివారణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఇప్పటివరకు 20 ఆపరేషన్లు చేయడంతో పాటు ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ టీం అనుబంధంగా ప్రతి పోలీస్‌స్టేషన్ నుండి ఇద్దరు కానిస్టేబుల్ కేటాయించామని, ఇప్పటికే ముప్పాళ్ళ, అమరావతి, నకరికల్లు, రాజుపాలెం ప్రాంతాలలో గంజాయి కేసులు నమోదు చేశామని తెలిపారు. డీఎస్పీ వెంట వినుకొండ రూరల్ సీఐ బొప్పన బ్రహ్మయ్య, ఎస్సై కె.వేణుగోపాల్ ఉన్నారు.

ప్రయాణికులకు నిత్యం పొగ..!

ప్రజాశక్తి - నాదెండ్ల

కమ్మేస్తున్న పొగతో ప్రయాణాలకు ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. మండలంలోని సాతులూరులోని చెత్తాచెదారన్నంతా తెచ్చి ఊరి వెలుపల రోడ్డుపక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. దీంతో పగలు రాత్రి తేడా లేకుండా రోడ్ల పక్కనే పొగలు కమ్ముకొని ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల్లో ప్రయాణించేవారు అవస్థ పడుతున్నారు. దీనితోడు ఈ వ్యర్థాల వద్ద కుక్కలు, పందుల సంచారం వల్ల అవి రోడ్డుపైకి వస్తూ వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. అవి తగలడం, లేదా వాటిని తప్పించే ప్రయత్నంలో పలువురు ద్విచక్ర వాహదార్లు ప్రమాదానికి గురై ఆస్పత్రుల పాలవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. వ్యర్థాల నిర్వహణ కేంద్రాలున్నా వాటిని ఉపయోగించకుండా ఇలా వ్యర్థాలను రోడ్డుపక్కన వేయడంపై విమర్శలు వస్తున్నాయి. 20 గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగే ఈ మార్గంలో దుస్థితి ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని, స్థానిక పంచాయతీ అధికారులు సైతం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించాలని, సత్వరం భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

30న పెదనందిపాడులో బాలోత్సవం

జయప్రదం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు పిలుపు

ప్రజాశక్తి - పెదనందిపాడు

తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డిసెంబరు 30 న పెదనందిపాడు కాలేజిలో జరిగే బాలోత్సవాలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, బాలోత్సవాల గౌరవ అధ్యక్షులు కె. ఎస్.లక్ష్మణరావు కోరారు. బాలోత్సవాల నిర్వహణ కమిటీ సమావేశం బుధవారం తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో విజ్ఞాన కేంద్రం కన్వీనర్, బాలోత్సవాల కో కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా బాలోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఆ సమావేశంలో లక్ష్మణ రావు పాల్గొని మాట్లాడారు. లక్ష్మణరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ డిశంబరు 30న పెదనందిపాడులోని పి.ఎ.ఎస్.కళాశాలలో పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు 18 రకాల ఈ వెంట్స్ నిర్వహించడం జరుగు తుందని అన్నారు. బాలోత్సవాల లో 500 లకు పైగా విధ్యార్థినీ విధ్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తారని, ప్రజలు చూసేందుకు ఉత్సాహభరితంగా ఉంటాయని అన్నారు. మొదటిసారిగా పెదనందిపాడులో నిర్వహిస్తున్న బాలోత్సవాల ను ప్రజానీకం చూసి పిల్లలను ప్రోత్సాహంచాలని కోరారు.విజయవాడ, మంగళగిరి, తాడేపల్లి విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలోత్సవాల లో వేలాదిమందిగా పిల్లలు పాల్గొంటున్నారని అన్నారు.ఈ బాలోత్సవాల ద్వారా పిల్లలను దురలవాట్లకు దూరంగా ఉంచవచ్చునని,చెడు నుండి మంచి వైపు మరల్చవచ్చని అన్నారు. బాలోత్సవాల చైర్మెన్ దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ, లక్ష్మణరావు గారు కృషి మరువలేనిదని, పిల్లలలో నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు రాష్ట్రం లో విశేష కృషి చేస్తున్నారని అన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ, బాలోత్సవాల ను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. పెదనందిపాడులో మంచి పనికి తోడ్పాటు అందించే పెద్దలు ఉండటం ఎంతో సంతోషదాయకమని అన్నారు.విజ్ఞాన కేంద్రం నిర్మాణం, నిర్వహణ లోనూ నాట్స్ మరియు స్తానిక పెద్దల సహకారం మరువలేనిదని అన్నారు.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పేదలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.కుట్టు శిక్షణ 5 వ బ్యాచ్ నడుస్తుందని, విధ్యార్థులకు వేసవి శిక్షణ, సెమినార్ లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో బాలోత్సవాల గౌరవాధ్యక్షులు ముద్దన రాఘవయ్య, డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య, కన్వీనర్ మక్కెన జవహర్ రాణి, కార్యదర్శులు గేరా మోహనరావు, జంపని రామారావు, ఎన్.సుభాని సాహెబ్ మాట్లాడారు. ఈ సమావేశంలో ముద్దన వెంకటేశ్వర్లు, కొర్రపాటి లక్ష్మి , ఫణిదపు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు,తదితరులు

ఎం.బుక్ కార్మికుల సమస్యలపై

మంత్రి లోకేష్ స్పందించాలి : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎం బుక్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ స్పందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరసన దీక్ష బుధవారం నాటికి ఆరో రోజుకు చేరింది. నిరసన దీక్ష శిబిరాన్ని లక్ష్మీనారాయణ స్పందించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్మికుల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంబుక్ కార్మికులకు రూ. పదివేల వేతనంతో ఇప్పటివరకు నైట్ డ్యూటీలు చేయించారని అన్నారు. ప్రస్తుతం పగల డ్యూటీ వేస్తున్నారని, దీనికి ఆప్కాస్ కార్మికుల లాగ రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ఏం బుక్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కొరకు ఆరు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు, మంత్రి నారా లోకేష్ స్పందించడం లేదని విమర్శించారు. తక్కువ వేతనాలతో నైట్ డ్యూటీలు చేస్తూ, కుటుంబం గడవక పగలు కూడా పనిచేసుకొని జీవిస్తున్నారని అన్నారు. ఎం బుక్ కార్మికులకు కేవలం రూ.10,000 మాత్రమే వేతనం ఇస్తున్నారని అన్నారు. రూ.పదివేలతో పగల డ్యూటీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి లోకేష్‌ను, కార్పొరేషన్ అధికారులను కార్మికులు కలిసినప్పటికీ పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, వివి జవహర్లాల్, కార్మికులు వాసంతి, కనకదుర్గ పాల్గొన్నారు.

దీక్షలకు మద్దతుగా శిబిరంలో కూర్చున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

కార్మిక విజయం

సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీతో సమ్మె విరమణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కార్మికుల ఐక్యత ముందు అధికారులు దిగిరాక తప్పలేదు. సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె అధికారులు సమస్యలు పరిష్కరిస్తామని రెండు నెలల జీతం చెల్లింపు, మిగిలిన నాలుగునెలల జీతం జనవరిలో చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికుల సమ్మె విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతు ఫిరంగిపురం పారిశుధ్య, వాటర్ వర్క్స్ కార్మికులు వేతనాలు చెల్లిచాలని గత రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. అధికారులు రెండు నెలల జీతాలు చెల్లించడంతో సమ్మె విరమించికార్మికులు విధుల్లో చేరారన్నారు. మిగిలిన నాలుగు నెలల జీతాలను పంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లిస్తామని ఫిరంగిపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి షేక్ ఫిరోజ్ తెలిపారు. కార్మికుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. పండగ పూట కూడా కష్టపడే పనిచేసి జీతాలు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తీసుకురావడం సరైనది కాదన్నారు. ఏ నెలజీతం ఆ నెల ఇవ్వకపోతే చాలీచాలని జీతాలతో పనిచేయటమే కాకుండా జీతాల కోసం నెలలు తరబడి ఎదురు చూడటం సరికాదన్నారు. ఇప్పటికైనా ఏ నెల జీతం ఆ నెల ఐదో తారీకు లోపు కార్మికులకు చెల్లించాలని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటే పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. మరో దఫా సమ్మె బాట పట్టకుండా జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగేందుకు కూడా సిద్ధమవుతావని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ రామారావు,బి ఇబ్రహీం, రాజేశ్వరరావు, శ్రావణ్ కుమార్, గంగయ్య, మరియదాసు, కొండయ్య, యేసు,హనోక్, వెంకటేశ్వరమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ వినియోగదారుల రక్షణ చట్టం-1986 అమలులో దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం స్పష్టంగా కనబడుతూ వినియోగదారుల ప్రయోజనాలను అపహస్యం చేస్తున్నారని గుంటూరు వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి టివి. కష్ణమూర్తి విమర్శించారు. జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక నగరంపాలెం, ప్రజ్ఞా పాఠశాలలో వినియోగదారుల సమావేశంలో కష్ణమూర్తి మాట్లాడుతూ కందిపప్పు దగ్గర నుండి పెట్రోలు వరకు నిత్యజీవితంలో మనిషి వాడుకునే ప్రతి వస్తువు నాణ్యత, తూనిక కొలతల్లో పారదర్శకత లోపిస్తుందని, దానిని నియంత్రించే ప్రభుత్వ యంత్రాంగం అవినీతి ఊబిలో కూరుకుపోయి వినియోగదారులకు నష్టం చేస్తున్నాయన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులను వినియోగదారుల రక్షణ చట్టం గురించి పాఠ్యాంశాలుగా చేర్చి విద్యార్థులను చైతన్య పరచాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందని చెప్పారు. వినియోగదారుల రక్షణకు చేపట్టాల్సిన అన్ని రకాల బాధ్యతలను ప్రభుత్వాలు విస్మరించి వ్యాపారస్తులకు లోపాయికారిగా సహకరించేలా వ్యవహరించటాన్ని ప్రజలు ప్రశ్నించాలని కోరారు. కల్తీలను అరికట్టే యంత్రాంగం, తగిన సిబ్బంది కఠినమైన చట్టాలు ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ప్రధాన కోరారు. సభకు అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షురాలు జూపూడి హైమావతి ప్రసంగించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్, డైరెక్టర్ నాయుడు కోటేశ్వరరావు, ప్రజాలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్, లీగల్ సెల్ కన్వీనర్ పి రామాంజనేయులు, కోశాధికారి కే కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసి కాలనీలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు పురమిత్ర యాప్‌ని వినియోగించు కోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్టీసికాలనీ, ఐపిడి కాలనీ, ఎల్ఆర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి పిజిఆర్ఎస్, డివైసిలో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేసి, ప్రజలతో పురమిత్ర యాప్‌ని డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురమిత్ర యాప్ ద్వారా 122 రకాల పురపాలక సేవలు, గ్రీవెన్స్‌లు, చెల్లింపులను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందేలా, అధికారులు జవాబుదారీతనంతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ని రూపొందించిందన్నారు. దరఖాస్తులను ఎప్పటి కప్పుడు వాటి పరిష్కారస్థితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ సదుపాయం ఉందన్నారు. ప్రతి దరఖాస్తు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉన్నందున సిబ్బంది కూడా భాద్యతగా వ్యవహరిస్తారని అన్నారు. ఐపిడి కాలనీ ఉత్తరవారి వీధిలో పందుల సమస్యపై అందిన ఫిర్యాదుని పరిశీలించి, పందులను పెంచేవారికి నోటీసులు ఇచ్చి, వాటికి స్పందించకుంటే జిఎంసి నుండి తగు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.అనంతరం ఆర్టీసి కాలనీలో ఆక్యుపెన్సీ కోసం అందిన దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని నిర్దేశిత ప్లాన్ మేరకు కొలతలు పరిశీలించారు.పర్యటన డిఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రంగారెడ్డి, ఎస్ఎస్‌లు సాంబయ్య, అయూబ్‌ఖాన్, పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పయనీర్ ఆటోమోటివ్స్‌లో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని పయనీర్ ఆటోమోటివ్స్ షోరూమ్‌లో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య స్నేహ సంబందాలను పెంచి, సానుకూలమైన పనివాతావరణాన్ని ఏర్పరుస్తాయని అన్నారు.

డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కెఎల్‌పి స్కూల్లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో నేడు సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జీసెస్ జీవిత వేశేషాలను, ఆయన చూపిన మహిమలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రేమ, ధర్మం, కరుణే జీవితం, మానవతే మహోన్నతి అని గుర్తు చేసేదే క్రిస్మస్ అని, యేసుక్రీస్తు ప్రేమకు, మానవత్వానికి ప్రతీక అని అన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక వెంకటాద్రి పేటలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం సెమీక్రిస్మస్ నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆరుమళ్ల నాగేశ్వరి అధ్యక్షత వహించగా, సిఐటియు నగర నాయకులు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బానిస ప్రజలు సంతోషంగా జీవించాలని ఏసు ప్రభు కోరుకున్నాడని, అణగారిన ప్రజలకు ఆశా జ్యోతిగా శిలువ మరణం వరకూ సహనంతో వహించారని చెప్పారు. నేటి కాలంలో శ్రామిక ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకుండా పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ నగర నాయకులు టి.రాధా ఓ.రోజమ్మ, ఎ.నాగేశ్వరి, స్వప్న, ఎస్తేరు విద్యార్థులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మిర్చితొడాల కార్మికులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదనందిపాడు : పెదనందిపాడు ఎస్.సి కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలో ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజ నేయులు పాల్గొని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి, ప్రేమ, దయ , కరుణతో తోటివారిపట్ల ముసలు కోవాలని క్రీస్తు జీవితం ద్వారా సందేశం అందించారని, క్రీస్తు మార్గంలో మనం నడవాలి అని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రావి శివరామకృష్ణయ్య, సంగం డైరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గీతవమ్స్‌లో జరిగిన కిస్మస్ వేడుల్లో పాల్గొన్న చిన్నారులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)

స్థానిక సిద్ధార్థ నగర్ లోని గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థిని విద్యార్థులకు మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందించిన శాంతి,ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని,క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. పలువురు చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలతో అలరించారు. అనంతరం చిన్నారులు సాంస్క అతిక కార్యక్రమాలు,న అత్యాలు నిర్వహించి క్రిస్మస్ గీతాలు ఆలపించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ కాంపౌండర్ నర్సుల అసోసియేషన్ చిలకలూరి పేట డివిజన్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అసోషియోషన్ సభ్యులు పల్లెపోగు ఎశోభుకు శాసనమండలి సభ్యులు సభ్యులు మర్రి రాజశేఖర్ నివాసంలో రూ.43 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం నాడు అందించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యద్దనపూ డి గ్రామానికి చెందిన తోటి కాంపౌండర్‌గా పనిచేస్తున్నటువంటి పల్లెపోగు యేసుబాబు గుండె జబ్బుతో బాధ పడుతుంటే వారి అసోసియేషన్ చిలకలూరిపేట వారు చేయూతనం దించి అతనికి వైద్య సహాయం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే మంచి ఉద్దేశ్యామన్నారు. ఈ అసోసియేషన్ యొక్క ముఖ్య ఉద్దే శం ఈ అసోసియేషన్‌లో ఉన్న సభ్యులు ఎవరికైనా ఆరోగ్యపరంగా గాని, ఆర్థికపరంగా గాని సమస్య ఉన్నప్పుడు మీకు అండగా మేమున్నాం అని ఒక భరోసాను కల్పించడానికి వారికి మానసిక ధైర్యం కల్పించడానికి క అషి చేస్తున్న దుకు సభ్యులను అభినందిస్తున్నాన న్నారు. అందుకు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి అనప ర్తి వెంకట్, మోహన్ రావు, అనపర్తి శ్రీను, షేక్ జిలాని, స్వామి నాయక్, వెంకటేష్ సభ్యులు పాల్గొనారు..

సిపిఐ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)

భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు ముగించుకొని డిసెంబర్ 26న 101వ సంవత్సరంలోకి అడుగుపడుతుంది. 100 సంవత్సరాల వేడుకలో భాగంగా ఈరోజు కీర్తిశేషులు పులుపుల వెంకట శివయ్య స్థూపం వద్ద నుండి పార్టీ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా మోటార్ బైక్ ర్యాలీని జండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉలవలపూడి రాము, మల్లికార్జున, రాయబారం వందనం, కొండ్రముట్ల సుభాని, రాచపూడి ఏసుపదం, సంపెంగల అబ్రహం రాజు, మేడ శీను, దారివేముల మరియబాబు ,తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు మిట్టగుడిపాడుకు ఎంపీ, ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - రెంటచింతల

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు గురువారం మండలంలోని మిట్టగుడి పాడు గ్రామంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, నారాయణపురం శ్రీనివాస రావులు చెప్పారు. 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న గిరిజన సంక్షేమ గురుకులం పనులు ప్రారంభించనున్నారు. దీని నిర్మాణం కోసం రూ.4.10 కోట్లు కేటాయించారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమ వుతుందని, నేతల పర్యటన జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎంఎం రెడ్డి కళాశాలలో ముగిసిన హ్యాకథాన్ -2025

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల ఏఎంఆర్ హ్యాకథాన్ - 2025 ది కోడ్ క్రుసేడ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా, విజయవంతంగా ముగిసిందని కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఈ హ్యాకథాన్ కార్యక్రమానికి నిపుణుల ప్యానెల్ గా ఏసీఐసీ-కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. రమణ కాంత్, కెఎల్టిఐఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు హరికృష్ణ లంక, భరత్ మండల స్టార్టప్ మెంటర్ కె. శ్రీనివాసరావు, గ్లోబల్ టెక్నాలజీ లీడర్ స్టార్టప్ మెంటర్ అబ్దుల్, గ్లోబల్ ఐటీ లీడర్ వెంపల్లి సునీల్ కుమార్ రెడ్డి,కెఎల్టిఐఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిరణ్ కుమార్ హాజరై, విద్యార్థులు రూపొందించిన వినూత్న ఆలోచనలు, టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలను లోతుగా పరిశీలించారు. ప్రాజెక్టులలో సాంకేతికత, వినూత్నత, వాస్తవ జీవిత అన్వయం, స్టార్టప్ సామర్థ్యం వంటి అంశాలను ఆధారంగా చేసుకుని మూల్యాంకనం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నిపుణులు, అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ భూషణరావు, అకాడమిక్ డైరెక్టర్ ఎ. పావని మాట్లాడుతూ హ్యాకథాన్ ద్వారా విద్యార్థులు సమస్యను గుర్తించడం, పరిష్కారం రూపకల్పన చేయడం, టీమ్ గా పని చేయడం, ఒత్తిడి లోనూ సమర్ధవంతంగా పని చేయడం వంటి కీలక నైపుణ్యాలను అలవర్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్. సింహాచలం, ఎం.మురళీకృష్ణ, సంబంధిత విభాగాధిపతులు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు బేష్ : చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ):

ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు చరవతో వినుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. డిసెంబర్ 5,6 తేదీల్లో ప్రజారోగ్య సౌకర్యాల జాతీయ నాణ్యత శాఖ కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, నమిత ప్రమాణాలు పై పర్యవేక్షించి తనిఖీలు చేశారు. ఎన్కాస్ కమిటీ ఆసుపత్రి లభిస్తున్న వైద్య సేవలపై సంత అప్తి వ్యక్తం చేసి 87.94/100 స్కోర్ పాయింట్లు కేటాయిస్తూ ధ్రువీకరించారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ రూమ్, ఓపి, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ఎక్సరే ల్యాబ్, ఐ పి డి, జనరల్ వార్డ్ లలో రోగులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ఎన్కాస్ కమిటీ కితాబునిచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది రోగులకు అందిస్తున్న మెరుగైన సేవల పట్ల ఎంకాస్ ప్రజారోగ్య సౌకర్యాల జాతీయ నాణ్యత కమిటీ భేష్ అని 87.94 ఇచ్చిన స్కోర్ పాయింట్లు పట్ల ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అభినందనలు తెలియజేశారు. వచ్చే ఏడాది 100/100 స్కోర్ పాయింట్లు సాధించాలని రాష్ట్రంలోనే వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రం రోగులకు ఉత్తమ సేవలు అందించుటలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

టీడీపి పార్లమెంటరీ ఉపాధ్యకునిగా దరువూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దరువూరి నాగేశ్వరరావు, రాయల శ్రీనివాసరావు.

నరసరావుపేట పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షునిగా సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నేత దరువూరి నాగేశ్వర రావు, టిడిపి పల్నాడు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాగ్దేవి విద్యా సంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్ రాయల శ్రీనివాస రావు నియమితు లయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసరావుపేటలో ప్రజాశక్తితో రాయల శ్రీనివాస రావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపిలో కష్టపడిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కుతాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా తన నియామకంతో పార్టీ కార్యకలాపాల నిర్వహణ పట్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

క్రైస్తవులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -బొల్లా (వినుకొండ)

క్రైస్తవ సోదరులకు ప్రభుత్వ చీఫ్ వెప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభువు యేసుక్రీస్తు ఆచరించిన ప్రేమ, కరుణ,సహనం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఆకాంక్షించారు. క్రీస్తు చూపిన మార్గమైన దయ, త్యాగ గుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకున్నప్పుడే జీవితం సంతోషమయ మవుతుందని, ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలందరి పట్ల కరుణ ప్రేమతో మెలుగుదామన్నారు. క్రిస్మస్ వేడుకలను ప్రజలంతా కలిసికట్టుగా జరుపుకోవాలని, అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కోరారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య

ప్రజాశక్తి - వినుకొండ

కుటుంబ కలహాల నేపథ్యంలో, బావ చేతిలో హతమైన బావ మరిది ఉదంతం పట్టణంలోని శ అంగారపువనంలో బుధవారం జరిగింది. మృతుడు రాచకొండ షారోన్ సోదరిని క్రోసూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చిలక గోపికి ఇచ్చి వివాహం చేశారు. ఇద్దరు సంతానం కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ముద్దాయి చిలక గోపి, మృతుడు షారోన్ మధ్య కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న షారోన్ పై, గోపి చిన్న గ్యాస్ సిలిండర్ తో తలపై మోదాడు. తీవ్రంగా గాయపడ్డ షారోను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటన తెలుసుకున్న పట్టణ సీఐ ప్రభాకర్ మ అతదేహాన్ని సందర్శించి. సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

వితంతువులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలం 88 తాళ్లూరు నందు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మానవి చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముందుగా దైవజనులు రాజేష్ మరియదాసు ప్రార్థనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మానవి చైతన్య సేవా సమితి వ్యవస్థాపకులు గౌరవనీయులు పి వెంకట్రావు(ఏపీ ఎన్జీవో పెదకూరపాడు శాఖ అధ్యక్షులు) అధ్యక్షత వహించారు.

టిడిపి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గానికి నూతన కమిటీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి టిడిపి నూతన కమిటీని ప్రకటించింది. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన సయ్యద్ జాన్‌సైదా అధ్యక్షునిగా, కార్యదర్శిగా నల్లపాటి రామచంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ట్రెజరర్‌గా తిరుమలకొండ నరసింహారావు, ఉపాధ్యక్షులుగా గురజాలకు చెందిన మేకల సాంబశివరావు, సయ్యద్ అమీర్ అలీ, నరసరావుపేటకు చెందిన మెట్టు వెంకటేశ్వరరెడ్డి, పెదకూరపాడుకు చెందిన షేక్.ముంతాజ్, పాటిబండ్ల బ్రహ్మయ్య, సత్తెనపల్లికి చెందిన దరువూరి నాగేశ్వరరావు, చిలకలూరిపేటకు చెందిన అమర రమాదేవి, వినుకొండకు చెందిన గోరంట్ల హనుమంతరావు, మాచర్లకు చెందిన సభావతు జబ్బార్ నాయక్ నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా రాయల శ్రీనివాసరావు, గొర్రెపాటి సుశీల, బత్తినేని శ్రీనివాసరావు, సాంబశివరావు, మద్దినేటి శాంతి, అల్లూరి పుల్లమ్మ, యర్రంరెడ్డి అంజిరెడ్డి, మంజుల అంజనీ కుమారి నియమితులయ్యారు. నరసరావుపేట కార్యాలయ కార్యదర్శిగా గొట్టిపాటి జనార్ధనబాబు, మీడియా కో-ఆర్డినేటర్‌గా గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా భీమవరపు లక్ష్మయ్య నియమితులయ్యారు.

క్రిస్మస్ కానుకగా రూ.50 కోట్లు

ప్రజాశక్తి - మాచర్ల

నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం పాస్టర్లకు 50 కోట్ల రూపాయలు విడుదల చేయటం పట్ల ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీలు దేశంలో అత్యున్నత ఉద్యోగాలైన ఐఎఎస్, ఐపీఎస్ శిక్షణకు ఉచిత కోచింగ్ సెంటర్లను పెట్టీ ,దళితులు సివిల్స్ ఉద్యోగాలు సాధించాలని, కొన్ని కోట్ల రూపాయలు దళితులకు కేటాయించడం చంద్రబాబు నాయుడికే సాధ్యమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందరి వాడినని చెప్పి క్రైస్తవులను, ముస్లింలను, దళితులతో పాటు అన్ని వర్గాలను దారుణంగా మోసం చేశాడని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభివఅద్ధికి సముచిత స్థానం కల్పించే నాయకులు చంద్రబాబు, లోకేష్ ,పవన్ కళ్యాణ్ మాత్రమే అని దళితలు చంద్రబాబు వెంటే ప్రయాణం చేస్తారని తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి - బొల్లాపల్లి (ఈపూరు)

సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలను తెగుళ్ళ బారి నుండి రక్షించవచ్చని ఏరువాక కేంద్రం నరసరావుపేట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పివి సత్య గోపాల్ అన్నారు. ఈపూరు మండలంలోని కొండ్రముట్ల, బోడెపూడి వారిపాలెం గ్రామాలలో సాగుతున్న మొక్కజొన్న, కంది,మిరప పొలాలను ఏవో ఆర్ రామారావు తో కలిసి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు తెలిపారు. కందిలో శనగపచ్చ పురుగు,ఆకుచుట్టు పురుగు, మరూక పచ్చ పురుగు ఉన్నట్లు గుర్తించి ప్రారంభ దశలోనే వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మిరపలో నల్లతామర పురుగు నివారణకు నీలం రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 పైగా అమర్చడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చారు ప్రారంభ దశలో వేప సంబంధిత క్రిమిసంహారక మందులు వాడటం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. వారితోపాటు వ్యవసాయ సహాయకులు షేక్ హుస్సేన్ వలి ఉన్నారు.

క్రిస్మస్‌కు సిద్ధమైన లూథరన్ చర్చి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

క్రైస్తవుల ప్రధాన పండుగ అయిన క్రిస్మస్‌కు పట్టణంలోని చర్చిలు అన్ని ఎంతో సుందరంగా అలంకరించబడ్డాయి . ప్రధానంగా సీయోను లూథరన్ చర్చి , మరియు ఆ పరిసర ప్రాంతాలు అంతా కూడా విద్యుత్తో అలంకరించ పడింది . దీనికి పండుగ ఒకభాగమైతే ఈ చర్చి 1925 ఏర్పడిన ఈ చర్చికి ఈ డిసెంబర్ నాటికి 100 ఏళ్ళు కావటంతో ఈ చర్చి ప్రాదాన్యత నింపుకుంది. కనివిని ఎరుగని రీతిలో ఈ పండుగకు అత్యంత శోభాయమానంగా ఈ చర్చని తీర్చిదిద్దారు . గుంటూరు హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట చర్చి ఉండటంతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

దుమ్ముతో కప్పేసిన ప్రత్తిపాడు - గొట్టిపాడు వెళ్ళే రోడు

రెండు దశాబ్దాల నిరీక్షణ.. ఐదుగురు ఎమ్మెల్యేలు..

మారని చిన్నకొండ్రుపాడు రాత!

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అది జిల్లాలోనే కీలకమైన నియోజకవర్గం.. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కి అనుసంధానంగా ఉండి, వేల కోట్లతో నిర్మించిన కంపెనీలు, వేలాది మంది ప్రాణాలు కాపాడే కాటూరి మెడికల్ హాస్పిటల్ వంటి సంస్థలు ఉన్న ప్రాంతం. కానీ, ప్రత్తిపాడు నుండి చిన్నకొండ్రుపాడు మీదుగా హైవేకి వెళ్లే రహదారి మాత్రం గత 20 ఏళ్లుగా 'నరకానికి నకలు'గా కనిపిస్తోంది.

పాలకుల మారారు.. రాతలు మారలేదు

రెండు దశాబ్దాలుగా ప్రత్తిపాడు రాజకీయాల్లో ఎందరో దిగ్గజాలు చక్రం తిప్పారు. మాకినేని పెదరత్తయ్య, రావి వెంకటరమణ, రావెల కిషోర్ బాబు, మేకతోటి సుచరిత.. ఇలా అందరూ ఈ రోడ్డుపై ప్రయాణించిన వారే.. ఇక్కడి దుమ్మును చవిచూసిన వారే. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, గెలిచాక విస్మరించడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం బూర్ల రామాంజనేయులు ప్రాతినిధ్యం వహిస్తున్నా, పరిస్థితిలో మార్పు రాలేదని స్థానికులు మండిపడుతున్నారు.

మాజీ మంత్రి 'శపథం' ఏమైంది?

గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి మేకతోటి సుచరిత గొట్టిపాడు, చిన్న కొండ్రుపాడు పర్యటనలో మాట్లాడుతూ.. "రోడ్డు వేస్తేనే మీ ఊరిలో అడుగుపెడతాను" అని శపథం చేసిన విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు. చిన్నకొండ్రుపాడు విషయంలోనూ ఇలాంటి మాటలే వినిపించినా, క్షేత్ర స్థాయిలో మాత్రం గుంతలు మరింత లోతయ్యాయే తప్ప తారు కాదు కదా ఒక్క తట్ట మట్టి కూడా పడలేదు. నాయకుల మాటలు కోటలు దాటుతున్నా, రోడ్డు మాత్రం అడుగు దాటడం లేదని ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రోగులకు ప్రాణసంకటం

- వాహనదారులకు ఆర్థిక భారం :

కాటూరి హాస్పిటల్ :

ఈ మార్గం గుండానే అత్యవసర స్థితిలో ఉన్న రోగులు కాటూరి ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. కానీ రోడ్డుపై ఉన్న గుంతల వల్ల అంబులెన్సులో వెళ్లే ప్రాణం సగదారిలోనే ఆవిరయ్యే పరిస్థితి ఉంది.

కంపెనీల ఇబ్బందులు :

ఈ రహదారి వెంబడి ఉన్న అనేక పరిశ్రమల వల్ల వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రావి పాటి వారి పాలెం వద్ద ఉన్న బ్రిడ్జి కూడా తుఫాన్ కారణంగా గండి ఏర్పడి ఉండటంతో లారీలు, ఇతర వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయి.

ఆర్థిక నష్టం:

సామాన్య ప్రజలు తమ కష్టార్జితాన్ని వాహనాల రిపేర్లకు, దెబ్బతిన్న వెన్నెముకలకు చికిత్స చేయించుకోవడానికే ఖర్చు చేయాల్సి వస్తోంది.

జాతీయ రహదారి చేరువలో ఉన్నా చీకటే:

ప్రక్కనే ధగధగలాడే జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) ఉన్నా, దానికి అనుసంధానించే ఈ కీలక రోడ్డు మాత్రం అంధకారంలోనే ఉంది. ఎండ వస్తే దుమ్ముతో ఊపిరాడదు, వర్షం వస్తే బురదతో కాలు కదపలేం.

ప్రజల హెచ్చరిక: ఇకపై మాటలు నమ్మే స్థితిలో తాము లేమని, తక్షణమే శాశ్వత పరిష్కారం చూపకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని చిన్నకొండ్రుపాడు గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ 20 ఏళ్ల సమస్యకు చరమగీతం పాడాలని కోరుతున్నారు.

దీక్షల్లో పాల్గొన్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

386వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 386వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కూరపాటి స్టీవెన్, కొర్రపాటి ఆదినారాయణ, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు, ఎం.గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో గొర్రెముచ్చు అన్నమ్మ, ఏనుగుల రమాదేవి, వేముల లక్ష్మమ్మ, వేము రిబ్కా, మొలక శారదా కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభాని, ఈమంభి,శారమ్మ, వై యహోషువ, ఆశీర్వాదం, డి.అంకయ్య, బి.ఏసోబు, హగ్గయ్య, పిచ్చయ్య, సూర్యప్రకాష్ ఆల్గొన్నారు. ఈ సందర్బంగా కార్మికుల సమస్య ను మంత్రి నారాలోకేష్ వెంటనే పరిష్కరించాలి అని నినాదాలు చేశారు.

పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ స్థల పరిశీలన

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలో నూతనంగా మంజూరు అయిన గ్రామపంచాయతీ బిల్డింగుల నిర్మాణానికి డ్వామా పిడి వి.శంకర్ నారాకోడూరు, వీరనాయకుని గ్రామాల్లో స్థలాలను బుధవారం పరిశీలించారు. ఒక్కో పంచాయతీకి రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. దీనిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుండి ఒక్కో గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.7 లక్షల అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ రాజ్ ఏఈ ఎస్.కె.ఫిరోజ్‌లాల్, నారాకోడూరు గ్రామ సర్పంచ్ వెలగా సాంబశివరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శులు గోపిశెట్టి రవితేజ, సుజన పాల్నొన్నారు.

వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్

హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరండి

ప్రజాశక్తి - కొల్లిపర

వాహనదారులు హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరాలని ఎస్పి ఎన్.సి.ప్రసాద్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కొల్లిపర కరకట్ట వద్ద వాహనదారులు హెల్మెట్ ధరించాలని ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే మైనర్లు వాహనాలు నడిపితే వారి మీద వారి తల్లిదండ్రులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు తొలగింపు

విలేకరి ఫిర్యాదుపై స్పందించిన విద్యుత్ శాఖ డిఈ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమస్యకు ముందు - సమస్య పరిష్కారం తరువాత

భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న విద్యుత్ వైర్లను ఆ శాఖ సిబ్బంది తొలిగించారు. స్థానిక హయ్యర్ పేట వద్ద మంగళవారం రాత్రి వడ్ల బస్తాలు లోడుతో వెళుతున్న భారీ వాహనం పైకప్పుకు విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ కారణంగా ఆ ప్రాంతంలో సుమారు రెండు గంటలు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాశక్తి విలేకరి స్పందించి వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న విద్యుత్ సిబ్బంది వాహానానికి తగిలిన విద్యుత్ తీగలను తప్పించి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. బుధవారం ఉదయం రంగంలోకి దిగిన విద్యుత్ సిబ్బంది కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను, సర్వీస్ వైర్లను పూర్తిగా తొలిగించారు. భారీ వాహనాలుకు సైతం అంతరాయం కలగకుండా విద్యుత్ తీగలను మరింత ఎత్తులోకి అమర్చారు. సమస్యపై స్పందించిన విద్యుత్ శాఖ టౌన్ డిఈ బోరుగడ్డ అశోక్ బాబు, లైన్ మెన్ పిల్లి సురేష్, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల సిబ్బంది, అధ్యాపకులు

కాళీ వరప్రసాద్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పెదకాకాని

నంబూరు గ్రామంలోని శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద్ ట్రస్ట్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ పి.రాఘవేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఈవో రూప్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సుజాత, భవ్య, సునీత పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి సుగుణ బేగం

యనమదల, తిమ్మాపురంలో పొలం పిలుస్తుంది

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలంలోని యనమదల, తిమ్మాపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం షేక్ సుగుణ బేగం నిర్వహించారు. రైతులు వేసిన శనగ మరియు మొక్కజన్న పంటలను పరిశీలించరూ. ఈ సందరరేగా ఆమె మాట్లాడుతూ శనగ పంటలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఒక్కసారిగా కాడలతోపాటు ముడుచుకుపోయి చనిపోతాయి. వేరు మరియు కాండాన్ని చీలిచి చూసినపుడు గోధుమ లేదా నలుపు రంగులో చార కనిపిస్తుంది. ఈ తెగులు కలుగజేయు శీలింద్రము విత్తనము మరియు మట్టి ద్వారా వ్యాపిస్తుంది. నివారణకు ఎండుతెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో 2 గ్రా. ట్రైకోడెర్మా విరిడిని 900 గ్రా. ల పశువుల ఎరువును మరియు 10గ్రా. ల వేప పిండితో కలిపి వాడాలి అని తెలిపారు. పంట అవశేషాలు యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం జి. వో నెం. 740 ప్రకారం నల్లబర్లి పొగాకు సాగు నిషేదించిందని దీనికి రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వి. హెచ్. ఏ. కె. చిన్ని రాజా, యం. పి. ఈ. ఓ. కె. నాగరాజు, ఏఈఓ వై.నీలాంబరం పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్తు

విజె డిగ్రీ కళాశా లలో జరిగిన కార్యక్రమంలో పతిజ్ఞ చేయిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నార్త్ స్టెప్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని వీ జె డిగ్రీ కళాశాలలో "డ్రగ్స్ వద్దు బ్రో" అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ విద్యార్థులు గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు మాత్రమే కాకుండా మద్యం జోలికి కూడా వెళ్లరాదని సూచించారు. గామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, మంగళగిరి రూరల్ ఎస్ఐలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

2025 రబీ సీజన్లో రైతులందరూ తమ వేసిన పంటలు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని, తాడేపల్లి మండల వ్యవసాయ అధికారిని పి.శిరీష అన్నారు. బుధవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి, గుండిమెడ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పావని, రమేష్, విఏఏ అఖిల్, తదితరు రైతులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చేబ్రోలు

వ్యాసరచన, డిబేట్ పోటీల్లో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ చాటారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని ఆహార పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో పరీక్షా భవన్ లో జిల్లా స్థాయిలో జరిగిన సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారని ప్రధానో పాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. మెరిట్ సర్టిఫికెట్ మెమెంటు ప్రధానోత్సవం గుంటూరులో జాయింట్ కలెక్టర్ బహుమతి అందజేస్తారు. నారా కోడూరు విద్యార్థులను పౌర సరఫరా అధికారులు పద్మ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాషా అభినందించారు.

బడుగు వర్యాగలకు సరుకుల అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

క్రిస్మస్ పండుగ నేపథ్యంలో మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో ఉన్న కాటి కాపరులకు, చర్మకార వృత్తిలో ఉన్న బడుగు వర్గాలకు బుధవారం కొమ్మారెడ్డి సేవా సమితి నూతన వస్త్రాలను, నిత్యావసర సరుకులను అందించింది. మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకుతల పాల్గొన్నారు.

గంజాయిని కూకటివేళ్ళతో పెకలించటమే లక్ష్యం : డిఎస్‌పి

ప్రజాశక్తి తెనాలి

గంజాయి ఆనవాళ్లు లేకుండా కూకటి వేళ్లతో సహా పెకలించటమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని డీఎస్పీ బి జనార్ధనరావు చెప్పారు. అదే లక్ష్యంతో సంకల్పం పేరిట నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని బుధవారం స్థానిక లెక్చరర్స్ కాలనీలోని మహిత జూనియర్ కళాశాలలో నిర్వహించారు. త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎస్‌పి మాట్లాడుతూ ప్రభుత్వ సంకల్పానికి ప్రజల సహకారం కూడా అవసరమని చెప్పారు. విద్యార్థులు లక్ష్యంగా సాగుతున్న గంజాయి విక్రయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా, దానిని సేవించినా నేరమేనని అన్నారు. గంజాయి పై ఎలాంటి సమాచారం ఉన్నా నిర్భయంగా టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అలా కాకుంటే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకుంటారని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలని 6న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, నూతన ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 26న జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి ఒక ప్రకటనలో కోరారు. 2005లో వామపక్షాల ఒత్తిడితో తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గత 20 సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మికులకు, పేద, చిన్న సన్నకారు రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో వలసల నివారణకు ఎంతో ఉపయోగపడిందన్నారు. నేడు కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసి నూతన చట్టం తీసుకుచ్చిందన్నారు. దీని వల్ల పేదరికం తగ్గకపోగా వలసలు పెరిగే అవకాశం ఎక్కువగా వుందన్నారు. అదే విధంగా రాష్ట్రాలపై భారం పెంచిడం వల్ల చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ నేపధ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కళ్లం కాలేజి అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

మంత్రు నాయక్‌ను అభినందిస్తున్న డైరెక్టర్

కళ్లం ఇంజినీరింగ్ కాలేజి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు డాక్టర్ గోనవత్ మంత్రు నాయక్‌కు ఆచార్య నాగార్జునా విశ్వవిద్యా లయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంత్రునాయక్ 'పెర్ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్ ఆఫ్ ఐడిఎస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఫర్ క్లౌడ్ ఎన్విరాన్ మెంట్' అనే అంశంపై పరిశోధన చేశారు. మంత్రు నాయక్‌కు ఏఎన్‌యు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రు నాయక్‌ను డైరెక్టర్ ఉమాశంకరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి. రెడ్డి, సి.ఎస్.ఇ విభాగాధిపతి డాక్టర్ సన్నీడియోల్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు, సహచరులు అభినందించారు.

కిట్స్ కాలేజీలో ముగిసిన ఐటి హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో మూడ్రోజులపాటు నిర్వహించిన ఐటి హేకథాన్ బుధవారం ముగిసింది. మేక్స్కిల్డ్ మాస్టర్ ట్రైనర్ కే రేవంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో 2వ సంవత్సరం ఐటి ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఫౌండర్ ఆఫ్ బిట్ అలర్ట్ సిఈఒ అజయ్ మాట్లాడుతూ 27 టీములు పాల్గొనగా అందులో ఐదు బెస్ట్ థీమ్స్‌గా ఎంపిక అయ్యాయన్నారు. ఈబెస్ట్ టీమ్‌కు రూ.12వేలు నగదు బహుమతి ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలలో స్ట్రాంగ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టం ఉందని, కళాశాలలో ప్రతి విద్యార్థికి కొత్త ఆలోచన చేయడానికి, ప్రయోగాలు చేపట్టడానికి, సజనాత్మకతను అభివృద్ధి చేయడానికి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నామని వివరించారు. కళాశాల సెక్రటరీ కోయ శేఖర్ మాట్లాడుతూ ఇన్నోవేషన్స్ ఈ తరానికి అత్యంత శక్తివంతమైన ఆయుధం అని వివరించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ ఈ కాలంలో కొత్త ఆలోచనలు మాత్రమే భవిష్యత్తును నిర్మించగలరని అన్నారు. డైరెక్టర్ డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ ఒక చిన్న ఆలోచన పెద్ద మార్పునకు ఆరంభం అని కొనియాడారు. కార్యక్రమంలో ఐటి విభాగం హెచ్ఓడిఎం ఎస్ఎస్ సాయి అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

అంతర్ కళాశాలల పోటీల్లో చలమయ్య కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈనెల 18, 19 తేదీల్లో ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలలో ప్రతిభ చూపారని కళాశాల సెక్రెటరీ కర్పూరపు సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించడం అభినందించదగిన విషయమని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. పి.మనోహర్ బాడీ బిల్డింగ్ 80 కెజిల విభాగంలో బంగారు పతకం, వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పథకం సాధించాడన్నారు. టి.నాగజ్యోతి వెయిట్ లిఫ్టింగ్ 77 కెజిల విభాగంలో సిల్వర్ పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎ.శ్రీధర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుభద్ర, కోచ్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల నిర్వహణపై మేయర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న మేయర్

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జనవరిలో జరగనున్న సంక్రాంతి సంబరాలను గ్రాండ్‌గా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనువాసులుతో కలిసి ఆయన ఛాంబర్‌లో సంక్రాంతి సంబరాలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరంలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించడానికి అనుమ తులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవ త్సరం కూడా సంక్రాంతి సంబరాలను నగరంలోని ఎన్‌టిఆర్ స్టేడి యంలో నిర్వహించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాల న్నారు. రానున్న కాలంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల లో విడివిడిగా సంక్రాతి సంబరాలు నిర్వహించుటకు ప్రణాళిక రూపొంది ంచాలన్నారు. నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోల్ సెల్ మార్కెట్ తొలగించటానికి చర్యలు తీసుకోవాలని, వేలం పాట ద్వారా షాపులను దక్కించుకొని నగర పాలక సంస్థకు రుసుము చెల్లించని షాపులకు వెంటనే రీ ఆక్షన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి పండుగ అనంతరం ఎన్టిఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సదరు సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జ్ యస్.ఈ సుందర్రామి రెడ్డి, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ శాంతి కళ, మేనేజర్ బాలాజీ బాష, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అల్గరిథమ్స్‌తో ఇంజినీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ హేమంత్‌కుమార్

ఆధునిక మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ ద్వారా ఇంజినీరింగ్ విద్యలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోనున్నాయని విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ. హేమంత్ కుమార్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'డేటా డ్రివెన్ అప్రోచెస్ టు ఎంపవరింగ్ ఇంజినీర్స్ ఫర్ ఎ సస్టెయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై మూడ్రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది.వర్క్‌షాప్‌లో డాక్టర్ టీ.హేమంత్ కుమార్ మాట్లాడుతూ యువ ఇంజినీర్లు కేవలం అల్గారిథమ్స్ నేర్చుకోవడానికే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ ప్రపంచ సమస్యలకు అన్వయించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాయని స్పష్టం చేశారు.ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ కె.టి. అరుణ్ మాట్లాడుతూ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా భారీ డేటాను విశ్లేషించి విధాన నిర్ణయాలు, వ్యాపార వ్యూహాలు, అకడమిక్ పరిశోధనలకు అవసరమైన స్పష్టమైన అవగాహన లభిస్తుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ సైనేక్రాన్‌లో డేటా సైంటిస్ట్ ఈ.వంశీక్రిష్ణ మాట్లాడుతూ డేటా అనలిటిక్స్, డేటా సైన్స్‌కు సంబంధించిన సిద్ధాంతాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎలా ప్రాయోగికంగా అమలు చేయవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన చలపతి కాలేజి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

చలపతి ఫార్మసీ కాలేజి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈనెల 23, 24 తేదీల్లో తాడికొండలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు గ్రామంలో ఆరోగ్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, టీకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాటలు, నృత్యాలు, వ్యాసరచన, క్విజ్ తదితర కార్యక్రమాల ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రత, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోటీల విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం ఎన్.నరసింహారావు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కృషిని అభినందించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జెవి.సుధీర్‌కుమార్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్రను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ కెఎన్.రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమానికి సాంబశివరావు ఆదర్శం

ప్రజాశక్తి-గుంటూరు

సంస్మరణ సభలో సాంబశివరావుకు సంతాపం ప్రకటిస్తున్న వివిధ రంగాల నాయకులు

తొలుత పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్ (పిఅండ్‌టి) రంగంలో, ఆ తర్వాత బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగుల సంఘంలో వివిధ స్థాయిల్లో నాయకుడుగా పనిచేసి ఇటీవల మరణించిన వి.సాంబశివరావు రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి ఆదర్శప్రాయులు అని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆలిండియా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జె.సంపత్‌రావు అన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సాంబశివరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సంపత్‌రావు మాట్లాడుతూ టెలికం ఉద్యోగుల సైద్ధాంతిక స్థాయిని, చైతన్యాన్ని పెంచేందుకు సాంబశివరావు విశేషమైన కృషి చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తన స్ఫూర్తిదాయక ప్రసంగాలతో బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులను కదిలించి అనేక పోరాటాలు, దేశవ్యాప్త సమ్మెలను విజయవంతం చేయడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. టి.వి9 సి.ఇ.ఓ, సాంబశివరావు కుమారుడు వి.రజనికాంత్ మాట్లాడుతూ నిరాడంబరత, సామాజిక సేవ వంటి ఎన్నో విలువలు పాటించిన సాంబశివరావు తండ్రిగా ఎన్నో కీలక సమయాల్లో తనకు సరైన దిశానిర్దేశం చేశారని అన్నారు. ఆలిండియా డాట్ అండ్ బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పి.అశోక్‌బాబు మాట్లాడుతూ పోస్టల్, టెలికాం, ఇన్సూరెన్స్ తదితర ఉద్యమాల్లో పాల్గొంటూ ఐక్య ఉద్య మాల పటిష్టతకు సాంబశివరావు చక్కటి కషి చేశారని అన్నారు. సిఐటియు జిల్లా ట్రెజరర్‌గా పలు సంవత్సరాల పాటు పనిచేసి విశాల కార్మికోద్యమానికి, అలాగే వామపక్ష భావాలతో

సమాజ శ్రేయస్సుకు పూర్తి కాలం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. సభలో పాల్గొన్న అనేక సంఘాల నేతలు సాంబశివరావుతో ఉన్న ఉద్యమ అనువాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సాంబశివరావు కుమార్తె, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు, వివిధ రంగాల నాయకులు జి.రత్తయ్య, ఎన్.నాగేశ్వరరావు, ఎస్. హనుమంతరెడ్డి, ఏ.వి.శివయ్య, సి.హెచ్.విద్యా సాగర్, వి.వి.కే.సురేష్, సి.హెచ్. వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణరావు ఎమ్. శ్రీనివాసరావు, సి. హెచ్.ఇనాక్, కే.చంద్రశేఖర్ పాల్గొన్నారు.